# తత్త్వం

## -దూరి వెంకటరావు

ట్రైన్లో చెరో బెర్తుమీద కూర్చుని కలాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు శ్రీహరి దంపతులు.

అనసూయమ్మకి ఈ ప్రయాణం హనీమూన్‌లా ఉంది. ఔనుమరి పెళ్ళై పన్నెండేళ్ళవుతోంది. ఎప్పుడైనా గుమ్మం కదిలితేనా? బదిలీ అయినప్పుడు తప్ప పాపం ఉత్తప్పుడు ఏనాడు రైలుగాని బస్సుగాని ఎక్కిన పాపాన పోలేదు. విశాఖపట్నం చూడాలని ఎప్పటినుండో పోరగా పోరగా ఇప్పటికి బయల్దేరదీసాడు భర్త.

తునిలో బండి ఆగగానే కిటికీలో నుండి బయటకు తొంగి చూసి చేయి ఊపాడు శ్రీహరి.

అతడి సిగ్నల్ కోసమే ఎదురుచూస్తున్నట్లు నవ్వుతూ బండెక్కారు ప్లాట్‌ఫారం మీద నిలుచున్న భార్యాభర్తలు.

''ఇతడు నా కొలీగ్ సింహాద్రి. ఈ మధ్యే ట్రాన్స్‌ఫరయి తుని వెళ్ళిపోయా డు. ఆవిడ అతని భార్య భ్రమరాంబ.'' శ్రీమతికి పరిచయం చేసాడు శ్రీహరి.

భ్రమరాంబ అనసూయ ప్రక్కన కూర్చుంది. మిత్రులిద్దరూ ఆఫీసు గొడవల్లో పడ్డారు.

''మీరు ఎంతవరకు వెళుతున్నా రు?'' మాట కలిపింది అనసూయ.

''మేమూ విశాఖపట్నమే బయలు దేరాం. మనమంతా సరదాగా వైజాగ్ తిరిగొద్దామని మీవారు ఉత్తరం రాసారు. అందుకే...''

''అలాగా బావుంది'' అని ఊరుకుంది అనసూయ.

అంతలో కంపార్టుమెంట్‌లోకి యాపిల్సు అమ్మవచ్చాయి. నలుగురికి నాలుగు యాపిలు పళ్లు తీసుకున్నాడు శ్రీహరి.

సింహాద్రి డబ్బులు చెల్లించపోతే వద్దంటూ వారించాడు.

పళ్ళు తింటూ అంతా మాటల్లో పడ్డారు.

ట్రైను కదలిపోతోంది.

కాలం కరిగిపోతోంది.

రైలు యలమంచిలిలో ఆగింది.

నలుగురు రెండేసి వడలు తిని కాఫీ కప్పులందుకున్నారు. మళ్ళీ శ్రీహరే డబ్బులిచ్చాడు.

ఈమారు సింహాద్రి ఏమనలేదు. కాఫీ గుటక వేస్తూ కమ్మగా కబుర్లు చెప్పసాగాడు.

ట్రైను మరేదో స్టేషన్లో ఆగితే మంచి నీళ్ళు పట్టుకొస్తానని చెప్పి వాటరు బాటిలు పట్టుకుని దిగాడు సింహాద్రి.

వార్తాపత్రికలో తల దూర్చాడు శ్రీహరి.

''అవిగో మల్లెపూలు'' అంది భ్రమరాంబ.

''ఆశ. తేరగా వస్తే సిగలో ముడుచుకుంటుంది కాబోలు'' స్వగతంలో అనుకుని ''నా దగ్గర చిల్లర లేదు మీరు పుచ్చుకోండి రెండు దండలు'' అంది బయటకు కసిగా.

''నా దగ్గరెప్పుడూ డబ్బులుండవండి. ఏం కావాలన్నా ఆయనే కొని పట్టుకొస్తూ ఉంటారు'' సత్తెకాలపు సత్తెమ్మలా అంది భ్రమరాంబ.



ఆ మాటకు అనసూయకి వంటికి ఆవ పూసుకున్నట్లైంది.

మరి మాట్లాడలేదు.

ఎందువల్లో బండి ఆ స్టేషన్లో చాలాసేపు ఆగిపోయింది. భ్రమరాంబ లేచి టాయిలెట్‌కు వెళ్ళింది.

''కూల్‌డ్రింక్స్ తాగుదామా'' అన్నాడు శ్రీహరి పేపరు మడుస్తూ.

''తీసుకునే మాటుంటే తొందరగా తీసుకోండి. లేకపోతే వాళ్ళకీ మనమే పెట్టుబడి పెట్టవలసి వస్తుంది'' అంది అనసూయ.

డ్రింక్స్ పుచ్చుకుని స్ట్రా నోట్లో పెట్టుకుంటూ ఉండగా 'మాకో?' అన్నట్లు ఊడిపడ్డారు సింహాద్రి దంపతులు.

వాళ్ళకి కూడ రెండు లిమ్కాలు అందుకున్నాడు శ్రీహరి.

విశాఖపట్నంలో దిగుతూనే అంతా ఆటోలో మంచి హోటల్‌కెళ్ళారు.

రెండు డబుల్ ఎ.సి. రూమ్స్ బుక్ చేసాడు శ్రీహరి.

సాయంత్రం ఆరవుతూనే ట్రిమ్‌గా తయారై బీచ్‌కి బయలుదేరారు.

మనోజ్ఞంగా ఉంది వాతావరణం.

ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి కడలిలో కెరటాలు.

అలలవంక పరుగు తీసారు సింహాద్రి దంపతులు.

''బయలుదేరి నప్పటినుండి చూస్తున్నాను. అన్ని ఖర్చులు మీరే పెడుతున్నారు తప్ప మీ ఫ్రెండు మాత్రం జేబులో చేయి పెట్టడం లేదు'' మనసులోని అక్కసును బయటకు కక్కింది అనసూయ.

''నాకూ అదే అర్థం కావడం లేదు. అయినా మనం తొందరపడొద్దు. చూద్దాం. నేనే వాళ్ళని రమ్మని పిలిచాను. అందుకే మొహమాట పడుతున్నాను'' అన్నాడు శ్రీహరి.

''ఏది ఏమైనా మీ ఫ్రెండు పరమ నక్కలా ఉన్నాడు. ఇక ఆ పతికి ఏ మాత్రం తీసిపోదా మహాసతి. అసలు మీరు వాళ్ళని పిలవకుండా ఉండవలసింది.''

మాటల్లో వచ్చారు సింహాద్రి దంపతులు.

పెదవులపై చిరునవ్వు తెచ్చిపెట్టుకున్నారు శ్రీహరి దంపతులు. మరునాడు ఇందిరా జూలాజికల్ పార్కు, హార్బరు సింధియా, నావెల్ బేసు చూసి తిరుగు ప్రయాణమయ్యారు.

నాలుగు రోజుల తర్వాత తుని నుండి ఒక కవరొచ్చింది.

రైటింగును బట్టి అది సింహాద్రి దగ్గర నుండేనని ఊహించాడు శ్రీహరి.

మిత్రమా!

మీతో జాయినవ్వడం వల్ల వైజాగ్ ట్రిప్పు మాకు కూడ ఓ జాలీ ట్రిప్ అయింది. పోతే, నా ఖర్చు లు మరొకరు పెడితే నా కిష్టం ఉండదు. అలాగే ఇతరుల ఖర్చుల్ని భరించే అలవాటు నాకు లేదు. ఒక ఖర్చు నేను మరో ఖర్చు నువ్వు పెట్టడం వల్ల మనలో ఎవరికో ఒకరికి చేతి చమురు ఎక్కువయ్యే ప్రమాదముంది. అందుకే నువ్వు విదిల్చిన ప్రతిపైసా మనసులో లెక్కిస్తూ వచ్చాను. మొత్తం పన్నెండు వందల నలభై రెండు రూపాయల యింది. అందులో మా వాటా ఆరువందల ఇర్వై ఒక్క రూపాయలకి డ్రాఫ్టు తీసి పంపిస్తున్నాను. ఆలశ్యమైనందుకు ఏమీ అనుకోకు.

ఇట్లు నీ

సింహాద్రి.

''సింహాద్రి తత్త్వం తెలియక మనం అనవసరంగా వాళ్ళని అపార్థం చేసుకున్నాం. చూడు నేను ఖర్చు చేసిన దాంట్లో సగం డబ్బు డ్రాఫ్టుతీసి పంపించాడు'' అన్నాడు శ్రీహరి.

భర్త మాటలకు ఏమనాలో తెలియలేదు అనసూయకి. లోకంలో ఇటువంటి వాళ్ళు కూడ ఉంటారా అని అనుకుంది.

★